సర్కారు బడిలో సకల సౌకర్యాలు

చొప్పదండి: మండలంలోని రాగంపేటలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్, మండల అధ్యక్షుడు ఎల్లయ్య విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో అందించే విద్య, సదుపాయాలపై ప్రచారం చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి ప్రచారంలో పాల్గొని తల్లిదండ్రులు ఉత్తమ ఫలితాలు అందించే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి ఫీజుల భారం తగ్గించుకోవాలని కోరారు.



చొప్పదండి: రాగంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న టీచర్లు, విద్యార్థులు గ్రామస్తులు

రామడుగు: మండలంలో శనివారం ఎస్టీటీయూ తెలంగాణ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరియాద మహిపాల్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్టీటీయూ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్, పెద్దపల్లి ఎస్టీటీయూ జిల్లా శాఖల అధ్యక్షులు ఊకంటి విజేందర్‌రెడ్డి, కిషన్, సిరిసిల్లా ప్రధాన కార్యదర్శి గోన సత్యం, మాజీ వైస్ ఎంపీపీ పూరెల్ల రాజగోపాల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు తిరుపతి, మాజీ ఉపసర్పంచ్ రాజు టీచర్లు పాల్గొన్నారు.



రామడుగు: బడిబాటలో మాట్లాడుతున్న ఎంఈవో వేణుకుమార్

యూరియా వాడకం తగ్గిస్తే దిగుబడి

చిగురుమామిడి: పంటల సాగులో యూరియా వాడకం తగ్గించాలని లేదంటే తెగుళ్ల ఉధృతి ఎక్కువై దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని సుందరగిరి, ఇందుర్తి రైతువేదికల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రైతులకు అధునాతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన సమావేశం నిర్వహించారు. జీలుగ విత్తనాల సాగుతో నేల సారవంతమవుతుందని, యూరియా వాడకం తగ్గిస్తే దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్‌రావు, బజేంద్ర, మానకొండూర్ డివిజన్ ఏడీఏ శ్రీధర్, ఉద్యానవన శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారిణి మంజువాణి రైతులు పాల్గొన్నారు.



సుందరగిరిలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

చల్లూరు రైతువేదికలో...

వీణవంక: మండలంలోని చల్లూరు రైతువేదికలో శనివారం వికసిత్ కృషి సంకల్ప్‌లో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంట సాగులో ఎదురవుతున్న సమస్యలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలను వివరించారు. ఈకార్యక్రమంలో డా.సునీత, శివకుమార్, మహేశ్, జి.ప్రభాకర్, మండల వ్యవసాయ అధికారి గణేష్, ఏఓ శ్రావన్, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

రామడుగు: నకిలీ విత్తనాలు అమ్మితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి త్రివేదిక హెచ్చరించారు. మండలంలోని గోపాల్‌రావుపేట, వెదిరలోని విత్తనాల షాపుల్లో శనివారం పత్తి విత్తనాల శాంపిల్స్ సేకరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతు తప్పకుండా రశీదు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే తక్షణం వ్యవసాయాధికారులకు సమాచారం అందజేయాలని రైతులను కోరారు. డీలర్లు అన్నిరకాల రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు.

సమాచారం

3 నుంచి రెవెన్యూ సదస్సులు

గన్నేరువరం: భూ సమస్యల పరిష్కారానికి 3 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని తహసీల్దార్ నరేందర్ శనివారం ప్రకటనతో తెలిపారు. 3న యాస్వాడ, 4న గోపాల్‌పూర్, 5న ఖాసీంపేట, 6న పారువెల్ల, 9న జంగపల్లి, 10న మైలారం, 11న మాదాపూర్, 12న హన్మాజిపల్లె, 13, 16వ తేదీల్లో గునుకులకొండాపూర్, 17, 18న గన్నేరువరంలో జరిగే రెవెన్యూ సదస్సుల్లో ఆయా అధికారులు పాల్గొంటారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంగాధర: మండలంలోని రెవెన్యూ గ్రామాలలో 3 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అనుపమరావు తెలిపారు. 3న ఇస్లాంపూర్, కాచిరెడ్డిపల్లి, 4న ఆచంపల్లి, ఒద్యారం, 5న కురిక్యాల, న్యాలకొండపల్లి, 6న నర్సింహులపల్లి, సర్వారెడ్డిపల్లి, 9న కొండాయిపల్లి, వెంకటాయిపల్లి, 10న మల్లాపూర్, 11న నారాయణపూర్, 12న గట్టుభూత్కూర్ 13న గర్శకుర్తిలో, 16న నాగిరెడ్డిపూర్, 17 ఉప్పరమల్యాల 18న భూర్గుపల్లిలో, 19 ర్యాలపల్లి, 20న గంగాధరలో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై ప్రజలు, రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రెడ్డి సంఘం భవనం ప్రారంభం

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో నిర్మించిన రెడ్డి సంఘం భవనాన్ని శనివారం ఆర్‌బీవీఆర్ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి గ్రామాలలో రెడ్డి సంక్షేమ భవనాలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. రెడ్డి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రెడ్డి సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బండ గోపాల్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి పింగిళి రవీందర్‌రెడ్డి, గోపాల్‌రావుపేట రెడ్డి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీచు రామకృష్ణారెడ్డి, కర్ర సాగర్‌రెడ్డి, సంఘం పాలక వర్గం, సభ్యులు పాల్గొన్నారు. సంఘం ఆధ్వర్యంలో పలువురిని సన్మానించారు.

◆ ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత

హుజూరాబాద్: మండలంలోని చెల్పూర్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. అర్హులైన 54 మందికి పంచాయతీ కార్యదర్శి జెయిందర్, మాజీ సర్పంచ్‌లు నేరెళ్ల మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పత్రాలు అందజేశారు. గ్రామశాఖ అధ్యక్షుడు గన్ను అశోక్, మహిళ అధ్యక్షురాలు పుల్ల రాధ, మండల యూత్ అధ్యక్షుడు అరవింద్, నాయకులు శనిగరం తరుణ్, అజ్జు, మధుసూదన్ తదితరులున్నారు.

శంకరపట్నం: మండలంలోని ఐదు గ్రామాల్లో శనివారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు అందించారు. మండలంలోని కరీంపేట, అంబాల్‌పూర్, చింతగుట్ట, చింతలపల్లి , కన్నాపూర్, ధర్మారం గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బస్వయ్య, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

◆ లక్ష్మీకాంతారావును కలిసిన మాజీ ఎంపీ

హుజూరాబాద్: మండలంలోని సింగాపూర్ గ్రామంలో రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావును కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పలు విషయాలపై చర్చించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నాయకుడు ఇంద్రనీల్ ఉన్నారు.

◆ స్వర్ణామృత ప్రాసన గుళికల పంపిణీ

హుజూరాబాద్: పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం వికాస తరంగిణి -హుజూరాబాద్‌శాఖ ఆధ్వర్యంలో స్వర్ణామృత ప్రాసన గుళికల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు నిర్వహించిన కార్యక్రమానికి చిన్నారుల తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించింది. కలకొండ గౌతమ్‌రావు మాట్లాడుతూ.. గుళికలను చిన్నారులు తీసుకోవడం ద్వారా మానసిక సామర్థ్యం, జీర్ణశక్తి మెరుగుపడుతుందని, చర్మం నిగారింపు, రోగ నిరోధక శక్తి, జ్ఞాపకశక్తి పెరుగుతుందనిదన్నారు. వికాస తరంగిణి అధ్యక్షుడు అరుణ్‌కుమార్, సభ్యులు నారాయనరెడ్డి, అంజనీదేవి, యతిపతి నిరంజన్‌కుమార్, చిదురాల శ్రీనివాస్‌రెడ్డి, చెరుకుపల్లి శ్రీనివాస్, శ్రావణ్ తదితరులున్నారు.

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వికాస తరంగిణి శాఖ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణామృత ప్రాసన ఔషధం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతినెలా పుష్యమి నక్షత్రం రోజున 6 నెలల నుంచి 16 సంవత్సరాల పిల్లలకు స్వర్ణామృత ప్రాసన చేయడం జరుగుతుందని, మొదటి విడతగా 260 పిల్లలకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు గౌతంరావు,ఆలయ కమిటీ చైర్మన్ ముక్కజితేంద్రగుప్తా, అర్చకులు డింగరి హరికృష్ణామాచార్యులు, ప్రభాకర్‌రావు, బచ్చు వీరలింగం, ముక్క శివకుమార్, శంకర్‌రెడ్డి, సురేష్‌బాబు, అంతం రాజిరెడ్డి, శ్రీనివాస్, వెంకన్న,రవీందర్, ముస్కే వీర్రాజు పాల్గొన్నారు.

◆ చట్టాలపై అవగాహన ఉండాలి

ఇల్లందకుంట: చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని హుజూరాబాద్ సివిల్ కోర్టు సీనియర్ జడ్జి కిరణ్ అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని రాచపల్లి గ్రామంలోని దళితవాడలో శనివారం మండల న్యాయ సేవా సమితి హుజూరాబాద్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఉచిత న్యాయసహాయం, యువత గంజాయి వంటి చెడు వ్యసనాల బారినపడకుండా తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గృహహింస, దళితులపై వివక్ష, న్యాయసేవా సంస్థ అందించే సేవలతో పాటు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సీ కాలనీలోని కొందరు దళితులు అగ్రకులాలవారి చేతిలో పలు సందర్భాల్లో వివక్షకు గురవుతున్నామని జడ్జికి మొరపెట్టుకున్నారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అరుణ్, లాయర్లు భాను కిరణ్, బత్తుల తిరుపతి, రవితేజ, ట్రైనీ ఎస్సై దీపక్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు

◆ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

హుజూరాబాద్: రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. శనివారం పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో వాకర్స్ కోసం రూ.పది లక్షలతో నిర్మించనున్న వాకింగ్ ట్రాక్, గేట్ పనులను ప్రారంభించారు. జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్ పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశామని, దళితబంధు నిధుల విషయంలో రాజకీయ ఉనికి కోసం వ్యాఖ్యలు చేస్తున్న ఎమ్మెల్యే తీరును ప్రజలు గమనిస్తున్నారని, నిధుల విడుదల ప్రక్రియ ప్రారంభమైందని, లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కమీషన్లకు తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నిధులు జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, నాయకులు తదితరులు ఉన్నారు.

క్రైం వార్తలు

ఉరేసుకొని ఒకరి మృతి

మానకొండూర్: మండలంలోని కొండపలకల గ్రామానికి చెందిన కుక్క రమేష్(40)మద్యానికి బానిసై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడుడు. సీఐ బి. సంజీవ్ తెలిపిన వివరాలు.. రమేశ్ ఏడాదిగా మద్యానికి బానిసై ఏ పని చేయకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటి ఎదుట షెడ్డులో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య లత, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

అదనపు కట్నం కేసు

జమ్మికుంట: అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు పాల్పడిన భర్తపై శనివారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ ఎస్ రామకృష్ణ తెలిపారు. ఇల్లందకుంట మండలం మల్యాల గ్రామానికి చెందిన స్రవంతికి భూపాలపల్లి జిల్లా రాంపూర్‌కు చెందిన నీలం జాన్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కొడుకులు, కొంత కాలంగా అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు పాల్పడతుండగా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో స్రవంతి ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటుంది. ఈ క్రమంలో భర్త జాన్ పిల్లలను బలవంతంగా తనవెంట తీసుకెళ్లాడు. దీంతో స్రవంతి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఆమె తండ్రి మ్యాకల సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

హత్యాయత్నానికి పాల్పడిన కొడుకుపై..

జమ్మికుంట: తల్లిపై హత్యాయత్నానికి పాల్పడిన కొడుకుపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. పట్టణానికి చెందిన విష్ణోజు లీలా భర్త కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. ముగ్గురు కొడుకులతో పట్టణంలో నివాసం ఉంటుంది. కొడుకు విష్ణువర్ధన్ చెడు అలవాట్లకు బానిసై తరచూ తల్లితో గొడవపడుతుండేవాడు. ఆస్తి కోసం పలుమార్లు దాడి చేయగా తల్లిగారింటికి వెళ్లింది. విష్ణువర్ధన్ ఇంట్లోని సామాను ధ్వంసం చేస్తున్నాడనే సమాచారంతో ఇంటికి చేరుకోగా కత్తితో దాడిచేయబోయాడు. తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి కొడుకును రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

యువకుడి అదృశ్యం..

మానకొండూర్: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రామగిరి లక్ష్మణ్ (21) అదృశ్యం కావడంతో శనివారం కేసు నమోదు చేశామని సీఐ బి. సంజీవ్ తెలిపారు. గ్రామానికి చెందిన రామగిరి అంజయ్యకు ఇద్దరు కొడుకులు, కూతురు. రెండో కొడుకు లక్ష్మణ్ పదో తరగతి వరకూ చదివాడు. మే 27వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల గ్రామాలు, బంధువులను సంప్రదించినా ఆచూకీ లభించలేదు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

పోలీసులు అడ్డుకోవడం సరికాదు

కరీంనగర్‌కార్పొరేషన్: జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం సందర్భంగా మంత్రులను కలవడానికి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం సరికాదని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిమ్‌ఫహాద్ అన్నారు. శనివారం నగరంలోలో మాట్లాడారు. పార్టీ నుంచి పురమల్ల శ్రీని వాస్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరేందుకే వెళ్లారని, సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి శంకర్ డిమాండ్ చేశారు.

ఏసీపీకి శుభాకాంక్షల వెల్లువ



హుజూరాబాద్: హుజూరాబాద్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన వాసంశెట్టి మాధవిని బీసీ సిటిజన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, నాయకులు శనివారం ఏసీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదరిశ వెంకన్న, కోశాధికారి సదానందం, కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరందాములు, కనకయ్య, సాగర్, నరేష్ ఉన్నారు. బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌రావు, శ్రీనివాస్, తదితరులు ఏసీపీని మర్యాద పూర్వకంగా కలిశారు. వెంట ధాజు, లక్ష్మణామూర్తి, రమాదేవి, రాజ్‌కుమార్, శ్రీధర్, అనిల్ తదితరులున్నారు.

క్లుప్తంగా

నిధులు కేటాయించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న రమేశ్

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారులో ప్రభుత్వ భూముల్లో లెదర్ పార్కు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 80 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం నిధులు కేటాయించాలని చర్మకార ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొత్తూరి రమేశ్ కలెక్టర్ పమేలా సత్పతికి శనివారం వినతి పత్రం అందించారు. లెదర్ పార్కులు సత్వరం ప్రారంభించేందుకు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు యుద్ధ ప్రాతిపదికన కేటాయించాలని, చర్మకారులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. వెంట బత్తుల సత్తయ్య, రామగిరి చందర్, సుంకె హరికృష్ణ, గాదె శ్రీనివాస్, శ్యామలత, తదితరులున్నారు.

బస్సు పునరుద్ధరించాలని..

చొప్పదండి: చొప్పదండి నుంచి వేములవాడ వరకు బస్సు సర్వీసును పునరుద్ధరించాలని గుమ్లాపూర్ గ్రామస్తులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు శనివారం వినతి పత్రం అందించారు. చొప్పదండి, జూలపల్లి, రామడుగు మండలాల ప్రజలకు అనుకూలంగా వేములవాడ, కొండగట్టుకు బస్సులు నడిపించాలని కోరారు. కరీంనగర్ నుంచి పుణ్య క్షేత్రాలకు వెళ్లడం ఆయా మండలాల ప్రజలు వ్యయ ప్రయాసలకు గురి కావాల్సి వస్తోందని, ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు.

సన్మానం



సర్వేశంను సన్మానిస్తున్న నాయకులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ధర్మారం గ్రామానికి చెందిన పెండెం సర్వేశం చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మైనార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులుసలీం పాషా, ఫజల్ రహెమాన్, అక్బర్‌పాషా, అంకూస్ పాల్గొన్నారు.


ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి ..



గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

మానకొండూర్: మాదిగ ఉద్యోగ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఇటీవల నియామకమైన రేణిగుంట నాంపల్లిని మానకొండూర్‌లో శనివారం ఎమ్మార్పీఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ముందుగా ఆయనకు ఘన స్వాగతం పలికి గజమాలలు, శాలువాలతో సత్కరించారు. ఎస్సీ వర్గీకరణ ధ్యేయంగా 30 ఏళ్ల క్రితం మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఎమ్మార్పీఎస్ లో అనేక పదవులు చేపట్టి మాదిగల కోసం ఉద్యమాలు చేశారని, మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మాదిగ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో రేణికుంట చంద్రమౌళి, కల్వల స్వామి, కనకం ఉదయ్, రేణిగుంట విజయ్, అజయ్, కనకం లక్ష్మయ్య, కిష్టయ్య, ఆర్.ఆంజనేయులు, రాకేశ్ పోచయ్య,రాజయ్య, సంపత్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి



మండల పరిషత్ ఎదుట నాయకుల నిరసన

గన్నేరువరం: ఈజీఎస్ కూలీలకు బకాయిలువెంటనే చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిరసన చేపట్టారు. ఏడు వారాల డబ్బులు చెల్లించక పోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పని చేసే ప్రదేశంలో కూలీలకు కనీస వసతులు కరువయ్యాయని, కొన్ని గ్రామాల్లో జాబ్‌కార్డుల డిలీట్ అవుతున్నాయని, పని కోసం కొందరు కూలీలు అధికారులకు విన్నపించినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శులు పిప్పల కనుకయ్య, కూన మల్లయ్య, యువజన నాయకులు మొలుగూరి అంజనేయులు, గుండ్లపల్లి గ్రామశాఖ కార్యదర్శి బోయిని తిరుపతి, బోయిని మల్లయ్య, దామా సంపత్, కూన ఎల్లయ్య, ఎండీ నయూమ్, తదితరులు పాల్గొన్నారు.





గన్నేరువరం: గన్నేరువరం నుంచి కరీంనగర్ వైపు వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై పెద్ద చెరువు వద్ద నిర్మించిన కల్వర్టుకు పగుళ్లు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వర్షాలు కురిసి చెరువులోకి భారీగా వరద నీరువస్తే రాకపోకలకు ప్రయాణికులు,వ వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతాయని, సంబంధిత అధికారులు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సురేశ్, ఏఈ ఆర్అండ్‌బీ ఏఈ, సెల్ నం : 94408 18859

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అభివృద్ధి

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

గంగాధర: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మధురానగర్‌లో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును శనివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ప్రారంభించారు. చొప్పదండి నియోజకవర్గంలోని 23 గ్రామాలలో రూ.2.63 కోట్లతో సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మిస్తామన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గం అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరవుతాయన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. ఎన్నికల వరకే రాజకీయాలు, తరువాత పార్టీలకు అతీతంగా అభివృద్ధికి పాటుపడాలన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం పాటుపడతానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, నాయకులు శ్రావణ్‌కుమార్, రామానుజం, మనోహర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవం చేస్తున్న కేంద్రమంత్రి సంజయ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, తదితరులు

శుభ్రతపై అవగాహన కల్పించాలి

జమ్మికుంట: రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నుంచి వంద రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో అధికారులు, మెప్మా, సంఘ సభ్యులు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో శనివారం సమీక్ష సమవేశం నిర్వహించారు. పట్టణ పరిశుభ్రత, వార్డుల్లో చెత్త సేకరణపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రాజిరెడ్డి, ఏఈ నరేష్, వికాస్, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, వాణి, టీపీవీవో దీపిక, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, సదానందం, ఎల్ఆర్పీలు జ్యోతి, మంజుల, సిబ్బంది రాజేందర్, కుమార్, ఉస్మాన్‌పాషా, సంతోష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ ఎండీ అయాజ్

ఆకట్టుకున్న నటన



చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న చిడతల రామాయాణ ప్రదర్శన శనివారంతో ముగిసింది. శ్రీరామ బ్రహ్మంగారి భక్తమండలి కళాబృందం కళాకారులు నాటకం ప్రదర్శించారు. సీతారామ పాత్రదారులు నటనతో ఎంతగానో ఆకట్టుకున్నారని పలువురు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అందె స్వామి, కళాకారుల సంఘం మండల అధ్యక్షుడు అన్నాడి మల్లికార్జున్‌రెడ్డి, కళాకారులు గట్టు లచ్చయ్య, చింతపూల కనుకయ్య, జంగ కొంరయ్య, చింతపూల ఈశ్వరయ్య, గుడికందుల రాములు, గట్టు భాస్కర్, మొగిలి, రవీందర్, సాయిలు, రమేశ్, మొగిలి, పలువురు కళాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సరదాగా మొదలెడితే.. ప్రాణాల మీదికొస్తుంది



మాట్లాడుతున్న డాక్టర్ లోకేశ్

జమ్మికుంట: పట్టణం, మండలంలో వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ధూమపానం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలు వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు సంధ్యారాణి, మహోన్నత పటేల్, చందన, ఫరహానుద్దీన్, హిమబందు, సంధ్య, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్స్ రత్నకుమారి, అరుణ, కుసుమకుమారి, సదానందం, నరేందర్, సరళ, వనజ, సావిత్రి, సాజిదా పర్వీన్, రాధా, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కరీంనగర్‌టౌన్: పొగాకు వాడకాన్ని సరదాకు మొదలుపెడితే.. అది ప్రాణాల మీదకు వస్తుందని మెడికవర్ వైద్యులు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా శనివారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని కళాభారతిలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులు మొదట కిక్కు కోసం ప్రారంభిస్తున్నారని, అదే వ్యసనంగా మారి పక్షవాతం, శ్వాసకోస వ్యాధులు, నియోనియా, కార్డియో మస్కులర్ వ్యాధులు, కొలెస్ట్రాల్ పెరిగి హార్ట్ స్ట్రోక్, నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, యూరిన్ బ్లాడర్ క్యాన్సర్ సంభవించి ప్రాణాలను హరిస్తుందన్నారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ లోకేశ్, క్రిటికల్ కేర్ హెచ్‌వోడీ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది